# ప్రేమబందీ

శ్రీరామచంద్రమూర్తి, శ్రీ కోదండరామస్వామి కోవెలకు బయలు దేరాడు. కారులో కాదు, బిళ్ళా బంట్రోతు వెంటలేడు, కాలి నడకన బయలు దేరాడు.

మూర్తి జిల్లా కలెక్టరు. మల్లె పువ్వులాంటి మనిషి. పాల బువ్వ లాంటి మనస్సు. ప్రజల పాలిట దేవుడు. పుట్టిబుద్ధెరిగినాక జీవితంలో ఇంతవరకు గుడికిపోలేదు.

మూర్తి అధికారేకానీ, అహంకారి కాదు. చిన్నవయసు పెద్ద ఉద్యోగం, మంచి జీతం, కుదురైన జీవితం, అయినా అహంకారం రాలేదు. గర్వం లేదు. కళ్ళు నెత్తికెక్కలేదు.

మూర్తికి ప్రజలపట్ల, డ్యూటీపట్ల అమిత గౌరవం, అధికభక్తి శ్రద్ధలు, ఇల్లూ వాకిలీ పట్టించుకోకుండా, భార్యా పిల్లల్ని చూచుకోకుండా, రాత్రింబవళ్ళు ఆఫీసు పనిలో మునిగి తేలుతుంటాడు.

జనం అతణ్ణి దేవుడంటారు. మొక్కుతారు. వారిస్తాడు. పొంగిపోడు. మరింత కుంగిపోతాడు. చాలా పనిచేస్తాడు. వాళ్ళ కోర్కెలు తీర్చాలనుకొంటాడు. ఒక్క కన్నీటి బొట్టు తుడిచినా జీవితం ధన్యమే అనుకొంటాడు.

తన డ్యూటీకీ, న్యాయానికీ సంఘర్షణ వస్తే తాను విలపిస్తాడేకానీ, జనాన్ని ఏడిపించడు. న్యాయం తప్పడు, అన్యాయం అసలు చేయలేడు. అవసరమైన పనులు, మంచి అనుకొన్న అన్నిపనులు చేయలేడు. అందరికీ సహాయం చేయలేడు. పనులు కాని వాళ్ళు అతణ్ణి ఆడిపోసుకోరు. మనిషి మంచివాడే, మాకర్మ ఇలా కాలింది అంటారు. అందరూ ఆనందంగా ఉండాలనుకొనే మూర్తికి సంపూర్ణ సంతోషం లేకపోవటం అవాస్తవమేంకాదు.

మూర్తి గుళ్ళూ గోపురాల చుట్టూ తిరగడు. పూజా పునస్కారాలంటూ అంగలార్చడు. ఇంట్లో పూజ గదిలేదు. గుడికి వస్తారా అని మిత్రులడిగితే 'టైమేది?' అంటాడు.

మంచి పనే దేవుడని మూర్తి నమ్మకం. ప్రజా కార్యమే దైవకార్యంగా భావించేవాడు.

స్వార్థపరులే దేవుడి చుట్టూ తిరుగుతారని అతడి నమ్మకం. కోరికలే కాళ్ళయి గుళ్ళ చుట్టూ తిరుగుతాయని మూర్తి విశ్వాసం. చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవటానికి దేవుడి అండకోరతారనీ, ఏదేదో ఆశలు నడిపిస్తే జనం గుడికి వెళుతుంటారనీ, అనుకొనేవాడు మూర్తి.

దేవుడు తనకు అన్నీ ఇచ్చాడు. అవసరానికి మించి ఇచ్చాడు. సుఖశాంతులున్నాయి. తృప్తి ఉంది. ఏంకోరి తాను గుళ్ళ చుట్టూ తిరగాలి?

తిరుపతి లడ్డు ప్రసాదం అని పెడితే అన్నం పరబ్రహ్మ స్వరూపం అని తినేవాడు. తాను గుడికి పోడుకానీ పోయేవాళ్ళను ద్వేషించడు. దైవ మహాత్మ్యాలను గూర్చి జనం చెబుతుంటే, వాదించకుండా, వారించకుండా వినేవాడు, మానవ మహాత్మ్యాలు చెప్పమనేవాడు.

అతణ్ణి నాస్తికుడని ఎవరూ అనలేరు. భక్తి ప్రపత్తులు లేవు అనీ చెప్పలేరు. గుడికి పోడు, పూజలు చేయడు అని మాత్రం చెప్పగలరు.

జనాన్ని ప్రేమిస్తే, ఆరాధిస్తే, వాళ్ళ అవసరాలు తీరిస్తే గుడికి పోయినట్లే, దేవుణ్ణి పూజించినట్లే అనుకొనేవాడు.

బాల్యంలోని ఆసక్తికొద్దీ గుళ్ళోకి చొరబడ్డాడు. భక్తి లేదు, పాదులేదు, మొక్కుబడీ లేదు. పూజా చేయలేదు. ఎవరాపినా ఆగలేదు. ఎవరికీ దొరకలేదు. తప్పించుకుపోయే తోవలేక దొరికిపోయాడు. నున్నగా దెబ్బలుతిన్నాడు. చేత్తో కొట్టలేదు. చెప్పుతో కొట్టారు. అదీ తనతండ్రి కుట్టిన చెప్పు.

తనను కానీ, తన తల్లి దండ్రులను కానీ, తమ వాడవాళ్ళను కానీ, గుళ్ళోకి రానీయరని మూర్తికి తెలిసిపోయింది. ఎందుకు రానీరో అప్పట్లో తెలియలేదు. తరవాత తెలిసింది. ఇప్పుడు రానిస్తారు. కానీ తాను పోడు! పోతే సకల మర్యాదలతో, సమస్త లాంఛనాలతో, పట్టుబట్టలతో సత్కరిస్తారు. అవి తాను తీసుకోలేడు.

అప్పుడే తన తండ్రిలాగా తాను చెప్పులు కుట్టకూడదనీ, వాటితో కొట్టించుకోకూడదనీ నిర్ణయించుకొన్నాడు. కొట్టేవాళ్ళ దగ్గర కూలి చేయకూడదనుకొన్నాడు. ఊళ్ళో ఉండలేకపోయాడు. పట్నం పోయాడు. చిల్లరమల్లర పనులు చేశాడు. కూటికోసం హాస్టల్లో చేరాడు. హాస్టల్లో ఉండేవాళ్ళు చదువుకోవాలి కాబట్టి చదువుకోసాగాడు. చదువుమీద గురి కుదిరింది. కడుపు నిండటానికి, కన్నీరు తుడవటానికి అక్షరాలు అంకెలు అందమైన అమ్మ చేతులయ్యాయి.

తాను పడ్డ కష్టాలు ఎవరికీ కలక్కూడదని ఆరోజుల్లోనే మూర్తి అనుకొనేవాడు. కష్టాల కడలి కొందర్ని ముంచి, రాక్షసుల్ని ఒడ్డుకేస్తుంది. కానీ మూర్తి సత్ప్రవర్తన వెనుక అతడి బాధల అనుభవం అంతర్లీనంగా మేలుకొని నడిపిస్తూ ఉంది. తాను కార్చిన కన్నీరే తనకు దారి చూపింది. తనకు సాధ్యమయితే ఇతరులకు కన్నీరు లేని తోవ వేయాలని ఆలోచించేవాడు. తాను కన్నీళ్ళు దిగమింగుతూ జనం నవ్వుముఖాలు చూడాలనుకోవటం అందరికీ సాధ్యం కాదు.

ఏమండీ ఎప్పుడూ గుడికి పోరూ అని ఎవరయినా అడిగితే టైమేది, తీరుబడి ఏదీ అనే మనిషి 'అంత అవసరం ఏమొచ్చింది?' అనేదాకా మారాడు.

అటువంటి మూర్తి గుడికి బయలుదేరాడు ఒంటరిగా. 'అంత అవసరం ఏం వచ్చింది?' అని ఎవరయినా అనుకొంటారు. మూర్తి ఆరోగ్యం బాగుంది. భార్య అనుకూలవతి. పిల్లలు

చక్కగా చదువుకొంటున్నారు. ఉద్యోగం బాగుంది. అన్నీ బాగున్నాయి. ఏంకొదవాలేదు. మరి 'అంత అవసరం ఏం వచ్చింది?' అందరికీ ఇదే ఆశ్చర్యం. జనం వింతగా చూస్తున్నారు.

మూర్తి ఇరవై నాలుగ్గంటలు పనిచేసినా ఫైళ్ళు తెమలవు. ప్రతిఫైలూ జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించటం అతడి పద్ధతి. తీరుబడి ఉండదు. ఏమాత్రం ఏమారినా ఎవరికో కష్టమో నష్టమో వాటిల్లవచ్చు. వాళ్ళ ఉసురు తగులుతుంది. అందువల్ల పనిభారం పెరుగుతుంది. అంత తీరుబడి ఉండని మనిషి గుడికోసం సమయం కేటాయించలేడు.

సినీమాలకు పోడు. షికారుల్లేవు. విసుగులేదు. విరామం లేదు. విశ్రాంతి తీసుకోడు. సెలవు పెట్టడు. వినోదంలేదు. రేడియో, టీ.వి. ఎప్పుడో తప్ప వినడు చూడడు. భార్యను పిల్లల్ని బయటికి తీసుకుపోడు. కలక్టరేటు, కేంపు ఆఫీసు గిరిగీసుకొన్నాడు. జిల్లా కేంపులు, గానుగెద్దు జీవితం. తన ఉద్యోగం పద్మవ్యూహం. అందులో ప్రవేశించాడు. బైటపడలేదు. కానీ విచిత్రం గుడికి బయలుదేరాడు.

పెద్ద వ్యాపారవేత్త-కావలసినన్ని లొసుగులు, కాపాడేది కలెక్టరు, దండం పెడితే దశగుణాలు-కారు దిగి నమస్కారం చేసి, ఎక్కడికని అడిగి, గుడికి అంటే కారెక్కమని కోరగా 'ఎక్కనని 'గుడికి కూడా కారా? కాలినడక చాలు!' అని మూర్తి వెళుతుంటే ఆనందపడి, ఆశ్చర్యపడి, తన కళ్ళను తానే నమ్మలేక చూస్తూ ఉండిపోయాడు.

మూర్తి సెలవు తీసుకొని స్వగ్రామం పోయి, పది రోజులుండి వచ్చిన దాఖలాలు లేవు. ఎవరికయినా స్వగ్రామం బాల్యంలోని ఆనందానికి గుర్తు. ఆటపాటలకు సంకేతం.

మూర్తికి కాలవ వంతెన, కాలవలో దూకటం, ఈదులాట, పంటపొలాలు, పిల్లకాలవలు, గొడ్డు కాయటం, చేని గనిమల మీద సాలె గూళ్ళ పైన పడ్డ మంచు బిందువుల గుండెలు కరిగిస్తూ మెరిపిస్తూ సూర్యకిరణాలు, తోటలు, తోపులు, దొంగతనాలు. పండుగాయలకు రాళ్ళ దెబ్బలు, పరుగెత్తటాలు, పారిపోవటాలు, రాలిపడే నారింజలు. పచ్చి వేరు సెనక్కాయ తంపట్లు, సెనిగమండలు పీకటం, ధనియాల కంపసువాసన, పిల్లి పిసర కోసి తినటం, గొడ్డుకు మేపటం, తాడిచెట్లు ఎక్కటం, గెలలు కొట్టం, కాయలు కోయటం, ముంజలు తీయటం, మామిడి పిందెలు, చింతచిగురు, చింతకాయలు, గరువునేల పరుగులు, రేగడి నేల బురద, వానలో ఎగుర్లాట, ఎండలో ఆగమ్మ కాకిలా తిరగటం, ఎన్ని జ్ఞాపకాలు, ఎన్ని మధురస్మృతులు, ఎంత ఆనందం, ఎంత పారవశ్యం, బాల్యం పూర్తిగా తాను అనుభవించలేదు. కానీ పూర్తి జీవితానికి పునాది అయిన చిన్నతనం ఎంత చిద్విలాసంగానో ఉండేది.

బురదలో ముల్లులాగా స్వగ్రామం ఆహ్వానం గుండెలో ఏదో తిరస్కారం గుచ్చుకొంటూ ఉండేది.

తమ పల్లె, తమ బంధువులు, వాళ్ల ఆశలు నెరవేరని కోరికలు, శ్రమ దోపిడీ, అసమానతలు సృష్టించే అలుసు, చులకన భావాలు, తగిలిన ఎదురు దెబ్బలు, తిరగబడ్డ శరీరం. మానిన గాయాలు, మానని మచ్చలు, మసిబారుతున్న జ్ఞాపకాలు.

గ్రామం ఒక జ్ఞాపకాల సంచి, ఎంత బరువో! గ్రామం ఒక పీడకల. ఎంత భయమో!

తానొక్కడే కొడుకు. తండ్రి చనిపోయాడు. తల్లి నేల తల్లిని నమ్ముకొని ఊళ్ళో ఉండిపోయింది.

ఎప్పుడు తల్లిని చూడటానికి ఊరికి పోయినా, తీపి బాల్య స్మృతులు, చేదు జ్ఞాపకాలు దొంతర్లు దొంతర్లుగా కదిలి పడేవి.

దూరం నుంచి స్వగ్రామం తలుచుకొంటే సంతోషంగా ఉంటుంది. దగ్గరకు పోయి చూస్తే బాధల మంటలు అంటుకొంటాయి. దూరపు కొండలు నునుపు. దగ్గరకు పోతే గరుకు.

తల్లికోసం పల్లెకు వస్తే బాల్యంలోని ఆనందాల తేనె సోనలు మధురాతి మధురంగానూ ఉంటాయి, తేనె తుట్టె చెలరేగి తేనెటీగలు ఝుంకారం పెచ్చరిల్లి మానిన గాయం కెలికినట్లయి సలపరం పుట్టేది.

సాధారణంగా తల్లి ఊరు విడిచిరాదు. వచ్చినా వారంకంటే ఉండదు. ఊరంతబలగం. ఊరు విడిచివస్తే అమ్మకు ఊపిరాడినట్లు ఉండదు. ఈ మధ్య తల్లి ఆరోగ్యం బాగా దెబ్బతింది. వండుకోలేకుండా ఉంది. అన్నింటికీ ఎవరో ఆసరాగా ఉండవలసి వస్తూ ఉంది. తల్లి అంతటి ఊరు. ఊరి నిండా తన వాళ్ళు.

గుంటూరు జిల్లా కలెక్టరుకు చెప్పి, రెవెన్యూ అధికారులను కదిపి అమ్మకు వైద్యం ఏర్పాటు చేయించాడు కానీ, తనకన్న కొడుకు తన దగ్గరుంటే ఆమెకు వైద్యాన్ని మించిన మందులు ఇచ్చినట్లు అవుతుందికదా. పెద్దతనం, పైగా అనారోగ్యం, కొడుకును కోడల్ని పిల్లల్ని చూడాలన్న యావ, కోడలు పిల్లలు వెళ్ళి చూచి వచ్చినా తృప్తి లేమి, అనుకొన్నప్పుడల్లా అన్ని బాధ్యతల మధ్య ఉన్న తాను వెళ్ళలేకపోవటం వల్ల చింత, తల్లినీ కొడుకునూ బాధిస్తున్నాయి.

సొంత జిల్లాకు బదిలీ చేయరు కాబట్టి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో దేనికయినా ట్రాన్స్‌ఫర్ చేయమని ప్రభుత్వాన్ని కోరాడు. ఆరాటపడ్డాడు. అమ్మ ఆరోగ్యం కుదుట పడలేదు. తనకు బదిలీ కాలేదు. ఈ రెండూ తీరని కోరికలు. ఈ అవసరం వచ్చి, దేవుడితో మొరపెట్టుకోవటానికి మూర్తి గుడికి బయలుదేరాడు.

ప్రభుత్వం, ప్రజల నాయకులు తన అభ్యర్థన వినక, బదిలీ చేయక, చేయించక పోవటంవల్ల, దేవుడయినా మొర ఆలిస్తాడని, ఈ సత్తెకాలపు సత్తెయ్య గుడికి వస్తుంటే పూజారి అల్లంత దూరం ఎదురుగా వచ్చి, స్వాగతం పలికాడు.

కలెక్టరు అయినా, గవర్నరు అయినా గుడికి కోరిక నివేదించుకొనే మనుషులుగా వస్తారుకానీ ప్రభుత్వ ప్రతినిధులుగా రారని, అటువంటి తన కోసం పనులు మానుకొని పూజారి ఎదురు రావటం న్యాయం కాదని అతణ్ణి మందలించాడు.

'మీరు అధికారి కాబట్టి ఎదురు వచ్చాను. మీరు కలెక్టరు కాకపోతే నన్ను మందలించలేదు' అన్నాడు పూజారి.

మూర్తి అవాక్కు అయ్యాడు.

పేదరికం ఉట్టి పడుతున్న పూజారి. చొక్కాలేదు. పంచ పాతది. చిరిగిపోవటానికి సిద్ధంగా ఉంది.

పూజారి తోవ చూపుతూ జనం అడ్డంరాకుండా తప్పిస్తూ ముందు నడుస్తున్నాడు.

రోడ్డుమీది జనం మూర్తిని విచిత్రంగా చూస్తున్నారు. కారులో తప్ప కనబడని మనిషి కాలినడకన పోతుంటే ఆశ్చర్యంగా ఉంది. కారులో నుంచి కొంచెం కొంచెం కనిపించే కలెక్టరును మళ్ళీ మళ్ళీ తొంగితొంగి చూచేజనం, ఎదుట నడుస్తుంటే ఎవరూ తోవ తప్పుకోవటం లేదు. బిళ్ళా బంట్రోతు యం.ఆర్.వో గుమాస్తాలు ముందు వెనుకల నడుస్తుంటే గౌరవంగా తప్పుకొనే జనాలు ఏ హంగూ ఆర్భాటం లేకపోవటంవల్ల లెక్కలేకుండా ప్రవర్తిస్తున్నారు. అర్జీలు తీసుకొని నంగినంగిగా వంగొంగి వచ్చే ప్రజలు కేరేఘాట్‌గా చూస్తూ పోతున్నారు. అధికారం ఉండికూడా హంగు లేకపోతే బొంగన్నా లెక్కపెట్టని జనాన్ని కలెక్టరు విచిత్రంగా చూడ సాగాడు.

తను ఈ జిల్లాకు కలెక్టరుగా వచ్చి ఏడేళ్ళ దాటింది. న్యాయంగా అయితే మూడేళ్ళకే బదిలీ కావాలి. కాలక్రమంలో వచ్చే కేడర్ ప్రమోషన్ వచ్చింది. జీతం పెరిగింది. కానీ కలెక్టరుగానే ఉంచారు. బదిలీ కాలేదు. తల్లి దగ్గరకు పోలేదు.

ఈ స్థాయి అధికారిని ఒక జిల్లాలో ఇంతకాలం బదిలీ చేయకుండా ఉంచటం భావ్యం కాదు. అది సబబుకాదు. బలమైన ప్రతిపక్షం నాయకులు ఈ జిల్లాలో లేరు. కలెక్టరుగా మూర్తి చేసే పనులవల్ల, పాలకపక్షం నాయకుడి ఓటు బేంకు బలపడుతూ ఉంది. పేద ప్రజలు ప్రభుత్వం పాలకపక్షం వైపు చేరుతున్నారు.

మూర్తి ప్రజల అవసరాలు బాగా తీరుస్తున్నాడు. పేదపాదల్ని కనిపెట్టి ఉంటున్నాడు. దిక్కూ దివాణం లేని బీదా బిక్కిని ఆదుకొంటున్నాడు. పై అధికారులేకాదు, కింది ఉద్యోగులు కూడా ఆత్మీయంగా ఉంటున్నారు. ప్రజలు ముఖ్యంగా పేదలు. బలహీనులు, దీనులు, కలెక్టరు బదిలీ కాకూడదని కోరుకొంటున్నారు. వాళ్ళ ప్రతినిధి, మినిష్టరు అయిన ఎంఎల్ఎ ప్రజల మాటను అక్షరాలా పాటిస్తున్నట్లు కనిపిస్తున్నాడు.

ఒక పార్టీ పాలనలో కలెక్టరు అయ్యాడు, మరో పార్టీ పాలనలో కలెక్టరుగా కొనసాగాడు. అప్పుడే ట్రాన్సుఫర్ అయి ఉండవలసింది. మళ్ళీ మునుపటి పార్టీ పాలనలోకి వచ్చింది. ఇంక నాలుగేళ్ళదాకా కూడా కలెక్టరును మార్చరని ప్రజలు చెప్పుకంటున్నారు.

ఇంత సీనియర్ ఆఫీసర్ను ఎంతోకాలం కలెక్టరుగా కొనసాగించటం సాధ్యంకాదని చీఫ్ సెక్రటరీ సూచించినా ప్రభుత్వం చలించలేదు.

ప్రజల సేవలో ఎవరైనా తనను ఎంతోకాలం కొనసాగించగలరు కానీ, కన్నకొడుకు చేతుల్లో తల్లి కన్నుమూసే అదృష్టం ఎవరు కలిగించగలరు?

దేవుడే దిక్కు!

అందుకే మూర్తి గుడికి బయలుదేరాడు. కొత్త బిచ్చగాడికి పొద్దెరుగన్నట్లు, కొత్త భక్తుడికి, కొత్త జనం ఎదురవుతున్నారు. కుర్చీలో కూర్చుంటే ఎదురుగా నిలబడే జనం కారు వీళ్ళు. ఎదురు వెళుతుంటే, కుర్చీలలోనుంచి లేవని జనం, తప్పుకోని జనం, లెక్కాపత్రం లేని జనం, పట్టించుకోని జనం ప్రత్యక్షమవుతున్నారు.

మూర్తి అందరితో తన కష్ట సుఖాలు చెప్పుకొన్నాడు. బదిలీ చేయించమని దరఖాస్తు పెట్టుకొన్నాడు. ఎవరూ తన అభ్యర్థనను మన్నించలేదు. మూర్తికి అనైతిక మార్గాలమీద ఆసక్తి లేదు.

అందరికీ తన పట్ల అభిమానం ఉండటంవల్ల మేలుకంటే కీడే ఎక్కువగా జరుగుతూ ఉంది. లంచాలు తీసుకొంటున్నా బదిలీ చేస్తారు. చెప్పిన మాటలు, మంచివికూడా, వినకపోయినా బదిలీ చేస్తారు. ప్రభుత్వానికి తలకాయ నొప్పులు తెచ్చినా బదిలీ చేస్తారు. కలెక్టరుగా చేయరు. పక్క జిల్లాకి పంపరు. హైద్రాబాదులో పడేస్తారు. ఈ అనుభవంలేని పనులు తానెలా చేయగలడు? ఇంత కాలం అలవాటుకాని పనులు ఇప్పుడెలా అలవాటు చేసుకోగలడు?

కలెక్టరును బదిలీ చేయవద్దని ప్రజలు, ప్రజానాయకులు కోరటం ఒక అధికారి పనితీరు మీద ఉత్తమ వ్యాఖ్యానమే. అది నిజంగా తనకు బహుమతే! అవన్నీ పెద్ద విషయాలు. తాను కోరుతున్నది చిన్న సంగతి. బదిలీ!

ఉద్యోగం చాలాకాలం ఉండేదే! తల్లి ఎల్లకాలం ఉండదు కదా! సెలవు పెట్టి అయినా వెళ్ళి తల్లిదగ్గరుండాలి. కనీసం రెండు నెలలు!

తల్లిది ఎంతకాలం జీవించినా ఎప్పుడో ఒకసారి పోయే ప్రాణమే! ఆమెకోసం కన్నబిడ్డల్లాంటి ప్రజల్ని, నాలుగు కాలాలపాటు బ్రతకవలసిన వాళ్ళను, వాళ్ళ ఆశల్ని, ఆరాటాలను

4

పోరాటాలను పట్టించుకోక పోవటం మంచిదా, ఆలోచించండి అన్న పెద్దలూ ఉన్నారు. వాళ్ల తల్లి దండ్రుల పరిస్థితులు ఏమిటో!

బిళ్ళా బంట్రోతు మాత్రం 'మీరు వెళ్ళండి. మీ తల్లి చివరి చూపులు తప్పవద్దు. ఆమె బ్రతికినంతకాలం బ్రతకదు. కనిపెంచిన ఆరాటం దొడ్డది. సెలవు పెట్టి వెళ్ళండి.'

'ఈ జిల్లా మీది. మీరు ప్రజల పాలిట దేవుడు. ప్రజలు మీకన్న బిడ్డలు. మీరే వాళ్ళ కన్నీళ్ళు తుడవగలరు. ఈ సమయంలో మీరు వెళ్ళిపోతే, వాళ్ళేమవుతారు. సెలవు పెట్టవద్దు, దయచేసి నా మాట మన్నించండి' అని జిల్లా మంత్రి బ్రతిమాలాడు. 'మిమ్మల్ని బదిలీ చేయవద్దని, సెలవు మంజూరు చేయవద్దని ఛీఫ్ సెక్రటరీతో చెప్పాను' అని మంత్రి అంటుంటే మూర్తికి చిరాకు కలిగింది.

ఈ ఉద్యోగం పంజరమా? ఇది ఓపెన్ ఎయిర్ జైలా? అనుకొన్నాడు మూర్తి. తాను బందీ. జిల్లాకు బందీ! ఎక్కడికీ పోలేడు. బదిలీ లేదు. సెలవు లేదు.

తనకు స్వేచ్ఛ లేదు. సొంత ఇష్టం లేదు. సొంత అవసరం లేదు. తను కదల్లేడు. సొంతకాళ్ళు లేవు.

కారులో తిరిగినా సుఖం కాదు, బంగళాలో ఉన్నా శాంతి లేదు. ఏసి గదుల్లో ఊపిరి ఆడటంలేదు. ప్రజల కన్నీళ్ళు తనకు సంకెళ్ళు. ప్రజల అవసరాలు తనకు ఉరితాళ్ళు. తాను దివారాత్రాలు బందీ! ఉద్యోగానికి బందీ! ఖరీదైన బందిఖానా!

ఎన్ని సంఘాలు? కార్మిక, కర్షక, రైతు, రైతుకూలీ, విద్యార్థి, యువజన, యన్.జీ.వో, జీ.వో, సవాలక్ష, మత, కుల, తెగల, వెనుకబడిన తరగతులు, దళిత, స్త్రీ సంఘాలు బదిలీ కోరవద్దని వచ్చి అర్థిస్తున్నాయి.

మూర్తిని బదిలీ చేసినా, సెలవు మీద పంపినా ప్రజలు ఊరుకోరనీ, సమ్మె చేస్తారనీ, ధర్నా నిర్వహిస్తారనీ, ఉద్యమాలు చేపడతారనీ, నిరసన తెలుపుతారనీ, నిరశన వ్రతాలు పూనుతారనీ, ప్రభుత్వాన్ని బెదిరిస్తున్నట్లు విని మూర్తి హతాశయుడైపోయాడు.

మూర్తికి ఉద్యోగ జీవితంతోపాటు సొంత జీవితం కూడా ఉంటుందనీ, అదికూడా ముఖ్యమేననీ, ఇంతకాలం తెలియలేదు. జనాలకు కలెక్టరు ముఖ్యమేకానీ, అతడి వ్యక్తిగత జీవితం అక్కరలేదు. పుకార్లు అయితే సరే కానీ తల్లిపట్ల ప్రేమ, దోమ అంటే వాళ్ళకు అంతుబట్టదు. కలెక్టరుకుకూడా సొంత ఇష్టాలు, అవసరాలు, అనుబంధాలు, ఆశాపాశాలు ఉండటం వాళ్ళకు అంతగా పట్టదు. జనం స్వార్థపరులు, తమ అవసరాలు తీరాలి. ఎవరు ఎట్లా పోతేనేం?

నిస్సహాయుడైన మూర్తి జీవితంలో మొదటిసారిగా గుడికి పోదామని బయలుదేరాడు.

పూజారితో పాటు గుడి ముంగిటకి మూర్తి వచ్చినప్పుడు జీపు దుమ్మురేపుకొంటూ వచ్చింది. డి.ఆర్.వో దిగి సెల్‌ఫోను చేతికిచ్చాడు. 'ఎవరు?' 'ముఖ్యమంత్రి' ఆత్రంగా అందుకొన్నాడు.

'ప్రజలు కోరుతున్నారు, అధికారులు అడుగు తున్నారు. పాలకపక్షం ప్రతిపక్షం పట్టుబడుతున్నాయి. ప్రజలు సమ్మెలు బంద్‌లు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో బదిలీ చేయలేను. సెలవూ ఇవ్వలేను. ఏమీ అనుకోవద్దు' ముఖ్యమంత్రి చెప్పాడు.

కలెక్టరుతో ముఖ్యమంత్రి అంతసేపు మాట్లాడటం గొప్ప. అధికారం, హోదా, అహంకారం. చుట్టూ ఉన్న ప్రజలు శ్రీరామచంద్రమూర్తికీ జై అంటున్నారు. బదిలీకాదు. సెలవు రాదు. మూర్తి పోడు!

శ్రీరామచంద్రమూర్తికీ జై అంటున్నారు ప్రజలు.

కోవెలలోని శ్రీకోదండ రామస్వామి జై జైలు విని మౌనంగా ఉన్నాడు.

మూర్తికి సంకెళ్ళమీద సంకెళ్ళు పడుతున్న చప్పుడు వినవచ్చింది. జైలు గదికి మరో కొత్త తాళం కప్ప తగిలించి బంధించినట్లు అనిపించింది. కాళ్ళకు, చేతులకు, నోటికి సంకెళ్ళు బిగించినట్లు అలికిడి అయింది.

అల్లంత దూరంలో కోవెల, గుడిముందు పూజారులు. గుడిచుట్టూ భక్తులు, తనచుట్టూ గుడికి పోయే భక్తులు. ప్రజలు. సవాలక్ష సమస్యలున్న ప్రజలు.

బిళ్ళాబంట్రోతు సైకిలు మీద చెమటలు కక్కుతూ వచ్చి మూర్తికి టెలిగ్రాం ఇచ్చాడు.

అంతదాకా 'శ్రీరామచంద్రమూర్తికీ జై' అంటున్న జనం టెలిగ్రాం అనగానే భయపడ్డారు. మూర్తి చేతులు వణికాయి. టెలిగ్రాం చదివాడు. చాలాసేపు చదివాడు. నాలుగు మాటలు. అంతసేపు చూశాడు. కన్నీటి బొట్లు టెలిగ్రాంను తడిపాయి. కాగితం హృదయం కరిగిపోతూ ఉంది.

కలెక్టరు కన్నీరు పెట్టటం జనం చూచి ఎరుగరు. ఇప్పుడు చూశారు. మూర్తి దేవుడే కాదు, మనిషికూడా అనుకొన్నారు.

మూర్తి కాళ్ళు వణుకుతున్నాయి. పడతానేమో అనుకొన్నాడు. బిళ్ళాబంట్రోతు భుజం మీద చేయి వేశాడు. అది అసాధారణ దృశ్యం. బంట్రోతు సంచలించిపోయాడు. ప్రజలు బిత్తరపోయారు. మూర్తి తూలుతున్నాడు. బిళ్ళా బంట్రోతు కలెక్టరు మూర్తిని పడకుండా పట్టుకొన్నాడు.

మూర్తి చుట్టూ చూశాడు. మనుషులు కనిపించటం లేదు. శూన్యం.

నాలుగడుగులేస్తే గుడి. అదే చాలా దూరంలా అనిపిస్తూ ఉంది.

మూర్తి జీపును రమ్మని చేతితో సైగ చేశాడు. డి.ఆర్.ఓ వచ్చి పక్కనే నిలబడ్డాడు.

కలెక్టరు జీపు ఎక్కాడు.

బిళ్ళా బంట్రోతు అడిగాడు 'గుడికా?' మూర్తి చెప్పాడు. 'పోను, ఎవరూ నా మొర వినలేదు' అన్నాడు.

'గుడికి పోరా?'

'ఆ అవసరం లేదు!'

జీపు బయలుదేరింది.

'ఆఫీసుకా?' డి.ఆర్.వో. అడిగాడు.

'రైల్వే స్టేషన్‌కి!'

కలెక్టరు మూర్తి కవుంటర్ దగ్గరకు పోయి టిక్కెట్టు కొనుక్కొని, ప్లాటు ఫారం మీదికి వచ్చి, ఆగి ఉన్న రైలు ఎక్కాడు.

డి.ఆర్.వో, డ్రయివరు, బిళ్ళా బంట్రోతు ఎక్కడికి అన్నట్లు చూశారు.

'మా వూరికి!' అన్నాడు.

బిళ్ళా బంట్రోతు అడిగాడు 'అమ్మకు ఎలా వుంది సార్?

'చనిపోయింది.'